జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 21 | జులై | 2026 ◆ పేజీలు : 5

## మనుపోతులగూడెం పోడు భూముల ఘర్షణ స్థలాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ , ఐటీడీఏ పీవో, డీఎఫ్ఓ



**అశ్వాపురం, జులై 20,ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని మను పోతులగూడెం గ్రామంలో భూముల విషయంలో వలస గుత్తి కోయలకు అటవీ అధికారులకు మూడు రోజుల క్రితం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనపై అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ ఉన్న స్థానిక సర్పంచ్ ని, స్థానికంగా ఉన్నప్రజలను ఘటన సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూముల పరిరక్షణ, ఆదివాసుల జీవనాధార అంశాలను సమగ్రహంగా సేకరించారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికి తీసి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమం లో ఐ టీ డీ ఏ పీ ఓ రాహుల్, భద్రాద్రి జిల్లా డి ఎఫ్ ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాలు శ్రేష్ట, స్థానిక అటవీ అధికారులు, తహసీల్దార్ సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




**పేదల వైద్యానికి పెద్ద దిక్కు... ప్రభుత్వ ఆసుపత్రులేనా..?**

5 లో

# పేదల వైద్యం.. వాస్తవ చిత్రం

ప్రజాజ్యోతి ప్రత్యేక కథనాల పరంపర

# ప్రశ్నలు మిగిల్చిన పోక్సో కేసు..!

**దర్యాప్తు కొనసాగుతున్నా.. ఇంకా సమాధానం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు**













**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 20, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 11 వ తారీఖున నమోదైన పోక్సో కేసు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసలు ఉదాంతం జరిగిన రోజు నుండి కేసు బయటకు వచ్చిన రోజు వరకు, దాని తర్వాత ఇప్పటి వరకు జరిగిన ప్రతి పరిణామంపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ఫిర్యాదు నమోదు, నిందితుల అరెస్టులు, మధ్యవర్తుల పాత్ర, కొందరు సిబ్బంది పై వచ్చిన ఆరోపణలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాలు, కేసుకు సంబంధించిన పరిణామాలపై అనేక చర్చలు జరిగాయి. ప్రస్తుతం ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ ప్రజల్లో ఇంకా కొన్ని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కేసు బయటకు వచ్చిన తర్వాత, అంతకు ముందు జరిగిన ప్రతి విషయంపై పూర్తి స్పష్టత రావాలని

మిగతా 2 లో... ▸

# మైనర్ గిరిజన బాలికపై అత్యాచారం

**పోక్సో కేసు నమోదు.. నిందితుడి కోసం పోలీసుల గాలింపు**




**అశ్వరావుపేట, జూలై 20 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలో మైనర్ గిరిజన బాలికపై అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంలోని సంబంధిత నిబంధనలతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, 16 ఏళ్ల గిరిజన బాలిక కొంతకాలంగా అశ్వరావుపేటలో నివసిస్తూ ఓ ప్రైవేట్ దుకాణంలో పనిచేస్తోంది. ఈ నెల 19వ తేదీ రాత్రి ఓ బంధువును ఆస్పత్రిలో

మిగతా 2 లో... ▸

# ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో సమస్యల గుట్ట..!

**దేశానికి ఆదర్శంగా నిలవాల్సిన భద్రాద్రి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో దుస్థితి..!**

**విద్యార్థుల ధర్నాతో బయటపడిన సమస్యల చిట్టా**

**ల్యాబ్‌ల నుంచి హాస్టల్ వరకు ఎక్కడ చూసినా లోపాలేనంటూ ఆవేదన**

**డిన్నర్ లేదంటూ హాస్టల్ విద్యార్థులను బయట భోజనానికి పంపిన యాజమాన్యం**

**విద్య నాణ్యత, విద్యార్థుల సంక్షేమంపై ప్రశ్నలు లేవనెత్తుతున్న పరిస్థితులు**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిది, జూలై 20, (ప్రజాజ్యోతి ):** దేశంలో భూవిజ్ఞాన శాస్త్రం, గనులు, ఖనిజ సంపద, భూగర్భ జలాలు, భూకంపాల అధ్యయనం, ప్రకృతి వనరుల నిర్వహణ వంటి కీలక రంగాల్లో నిపుణులను తయారు చేయాలనే లక్ష్యంతో భద్రాద్రి జిల్లలో ఏర్పాటైన మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో నెలకొన్న పరిస్థితులు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అత్యాధునిక సాంకేతిక విద్య, పరిశోధనలకు కేంద్రంగా ఉండాల్సిన ఈ విశ్వవిద్యాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవంటూ విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగడం ప్రతి ఒక్కరికి ఆందోళన కలిగిస్తోంది. దేశ భవిష్యత్తుకు అవసరమైన శాస్త్రవేత్తలను తయారు చేయాల్సిన విద్యాసంస్థలో విద్యార్థులు

మిగతా 2 లో... ▸

## మైనర్ గిరిజన బాలికపై అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి...)

పరామర్శించి తిరిగి వెళ్లేందుకు బస్టాండ్ వద్ద వేచి ఉండగా, గత పరిచయం ఉన్న యువకుడు ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద దింపుతానని చెప్పి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. మార్గమధ్యంలో నిర్మానుష్య ప్రాంతంలో వాహనం ఆపి, బాలిక అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. అనంతరం ఆమెను తిరిగి బంధువుల నివాసం సమీపంలో దింపి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన బాలిక జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో, వారు వెంటనే పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోక్సో చట్టంతో పాటు బీఎన్ఎస్‌లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మైనర్‌పై లైంగిక దాడి కేసు కావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, అతడిని త్వరలోనే అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

## ప్రశ్నలు మిగిల్చిన పోక్సో కేసు..!

(మొదటి పేజీ తరువాయి...)

చాలామంది కోరుకుంటున్నారు. దీంతో దర్యాప్తులో ఇంకా ఏం తేలుతుంది.. ఇంకెవరైనా పాత్ర ఉందా.. అనే చర్చ కూడా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. వాస్తవానికి పోక్సో కేసుల్లో తొందరపడి ఎలాంటి నిర్ణయానికి రావడం కంటే, అన్ని ఆధారాలు సేకరించి నిజానిజాలు బయటకు తీసుకురావడం చాలా ముఖ్యం అని పొలిసులు వ్యవహరిస్తుంటే.. చిన్నారులకు న్యాయం జరగాలంటే దర్యాప్తు పూర్తిగా, నిష్పాక్షికంగా, తొందరగా జరగాల్సిందేనని ప్రజలు కోరుకుంటున్నారు. ఇదే సమయంలో గతంలో 2014వ సంవత్సరంలో ఇదే స్టేషన్ పరిధిలో జరిగిన పోక్సో కేసును కూడా కొందరు గుర్తు చేసుకుంటున్నారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా సంభందిత ప్రతి కేసులో ఒకే విధంగా చట్టం అమలవ్వాలని, ఎవరు అయినా ఒకేలా విచారణ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. అలా అయితేనే చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకం ప్రజల్లో ఉంటుందని, దర్యాప్తు కూడా అదే విధంగా సాగాలని అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కేసులో ఇంకా కొన్ని ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. అవన్నీ దర్యాప్తులోనే తేలాలి. ఆ నిజాలను పూర్తిగా బయటకు తీసుకురావడమే ఇప్పుడు దర్యాప్తు ముందున్న ప్రధాన బాధ్యతగా ప్రజలు భావిస్తున్నారు.

## అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించాలి





**ములకలపల్లి, జూలై 20 (ప్రజాజ్యోతి ):** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఖమ్మం పార్లమెంట్ కోఆర్డినేటర్ నల్లపు దుర్గాప్రసాద్, అశ్వారావుపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ తుమ్మ రాంబాబు, అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ములకలపల్లి మండల కోఆర్డినేటర్ సురభి రాజేష్,తో కలసి పరిశీలించారు. ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా చేపట్టి అర్హులందరికీ న్యాయం చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా కీలకమని, ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యండి జహీరుద్దీన్, జిల్లా నాయకులు పేటేటి నర్సింహారావు, పాలకుర్తి రత్నభూషణం, కొప్పుల రాంబాబు, శనగపాటి రవి, మడకం రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో సమస్యల గుట్ట..!

(మొదటి పేజీ తరువాయి...)



తమ ప్రాథమిక హక్కుల కోసం ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం విద్యావర్గాల్లోనూ చర్చకు దారితీస్తోంది.

**ఇవి సమస్యలుగా..**

విద్యార్థులు వెల్లడించిన వివరాల ప్రకారం, యూనివర్సిటీలోని కంప్యూటర్ ల్యాబ్‌లో సరిపడా కంప్యూటర్లు లేవని, బీఈఈ ల్యాబ్‌లో అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని, వర్క్‌షాప్ ల్యాబ్‌లో కూడా శిక్షణకు అవసరమైన యంత్రాలు లేక ప్రయోగాత్మక బోధన దెబ్బతింటోందని ఆరోపిస్తున్నారు. పుస్తకాల్లో బోధించే విద్యతో పాటు ప్రత్యక్ష ప్రయోగాలకు అధిక ప్రాధాన్యం ఉండే కోర్సులు నిర్వహిస్తున్న యూనివర్సిటీలోనే ఈ పరిస్థితి ఉండడం వల్ల విద్యార్థుల విద్యాభవిష్యత్తుపై ప్రభావం పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయోగశాలలు సక్రమంగా లేకపోతే విద్యార్థుల నైపుణ్యాలు ఎలా పెరుగుతాయని ప్రశ్నిస్తున్నారు. హాస్టల్ పరిస్థితి మరింత దారుణంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. బాత్రూమ్‌లకు తలుపులు లేకపోవడం, ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం, పురుగులు అధికంగా ఉండడం, తరచూ శుభ్రత నిర్వహించకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన కనీస ప్రమాణాలు కూడా పాటించడం లేదని అంటున్నారు. రాత్రి సమయంలో అత్యవసర వైద్య పరిస్థితులు ఏర్పడితే సహాయం చేసే వ్యవస్థ కూడా అందుబాటులో లేదని, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.

**భోజనాలు బయట తినాలని ఆదేశాలు..**

ఇక్కడ మెస్ నిర్వహణపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. భోజనం నాణ్యత సరిగా లేకపోయినా మెస్ ఛార్జీలు మాత్రం పూర్తిస్థాయిలో వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీనికి పరాకాష్టగా ఆదివారం రాత్రి స్టోర్ సమస్య కారణంగా ఈరోజు డిన్నర్ అందుబాటులో ఉండదు. విద్యార్థులు రాత్రి 8 గంటలలోపు బయటకు వెళ్లి భోజనం చేసి రావాలి. ఆ తర్వాత బయటకు వెళ్లిన వారికి అనుమతి ఉండదు అంటూ యాజమాన్యం నుంచి సందేశం పంపినట్లు విద్యార్థులు వెల్లడించారు. ఒక ప్రభుత్వ హాస్టల్‌లో వందలాది మంది విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయలేక బయటకు వెళ్లి తినాలని సూచించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. విద్యార్థుల ఆహార భద్రతకు బాధ్యత వహించాల్సిన యాజమాన్యం చేతులెత్తేసిందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు స్కాలర్‌షిప్ లేని విద్యార్థులు పెండింగ్ ఫీజులను వెంటనే చెల్లించాలని యాజమాన్యం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఫీజుల వసూళ్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు, అదే సమయంలో విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారనే ప్రశ్న విద్యార్థుల నుంచి వినిపిస్తోంది. విద్యార్థులు ఫీజులు చెల్లించడం తమ బాధ్యత అయితే, నాణ్యమైన విద్య, సురక్షితమైన హాస్టల్, మెరుగైన భోజనం, ఆధునిక ల్యాబ్‌లు కల్పించడం యూనివర్సిటీ బాధ్యత కాదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా..**

తాము యూనివర్సిటీలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి గణనీయమైన అభివృద్ధి పనులు కనిపించలేదని సీనియర్ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం కొత్త విద్యార్థుల ప్రవేశాలు జరుగుతున్నా, అందుకు అనుగుణంగా మౌలిక వసతులు పెరగడం లేదని, సమస్యలు మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయని అంటున్నారు. ఈ పరిస్థితులన్నింటినీ అధికారుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో చివరకు ధర్నా చేయాల్సి వచ్చిందని విద్యార్థులు చెబుతున్నారు. భూవిజ్ఞాన రంగంలో దేశానికి అవసరమైన నిపుణులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ విశ్వవిద్యాలయం ఇలాంటి సమస్యలతో వార్తల్లో నిలవడం బాధాకరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దేశ స్థాయి గుర్తింపు పొందిన సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, హాస్టల్ నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం అత్యున్నత ప్రమాణాల్లో ఉండాల్సి ఉండగా, ఇక్కడ విద్యార్థులే తమ సమస్యలను బయటపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడటం యాజమాన్య పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు లేవనెత్తిన ప్రతి అంశంపై యూనివర్సిటీ యాజమాన్యం సమగ్రంగా స్పందించి, వాస్తవ పరిస్థితులను వెల్లడించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక బృందంతో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని విద్యార్థులు కోరుతున్నారు. దేశానికి శాస్త్రవేత్తలను అందించాల్సిన ఒక ప్రముఖ ప్రభుత్వ విశ్వవిద్యాలయం భద్రాద్రి లో ఉండటం ఒక గర్వకారణం. దీనిపై సంభందిత రాజకీయ నాయకులు త్వరిత గతిన స్పందించి సమస్యను పరిష్కరించాలని జిల్లా ప్రజల నుండి కూడా డిమాండ్ వినిపిస్తోంది.

## మాజీ సర్పంచ్ సోయం రాజాబాబుకు ఎమ్మెల్యే జారే నివాళి

### పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు పరామర్శ



**దమ్మపేట, జూలై 20(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలంలోని కొమ్ముగూడెం గ్రామ మాజీ సర్పంచ్ సోయం రాజాబాబు అనారోగ్యంతో మృతిచెందడంతో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సోయం రాజాబాబు గ్రామాభివృద్ధికి, ప్రజా సేవకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొని సోయం రాజాబాబుకు ఘనంగా నివాళులర్పించారు.

## సోయం రాజాబాబు మృతి తీరని లోటు...

### మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

### కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా





**దమ్మపేట, జూలై 20(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలంలోని కొమ్ముగూడెం గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు సోయం రాజాబాబు మృతిపట్ల అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన కొమ్ముగూడెంలోని నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సోయం రాజాబాబు గ్రామాభివృద్ధితో పాటు పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రజలతో మమేకమై సేవలు అందించిన నాయకుడి మృతి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దారా యుగంధర్, పెద్దగొల్లగూడెం సర్పంచ్ యాట్ల రాందాస్, నారం రాజశేఖర్, గాజుబోయిన యేసుబాబు, రావుల శ్రీను, జలగం వాసు, అబ్దుల్ జిన్నా, రామకృష్ణ, చీకటి రామయ్య, యార్లగడ్డ శ్రీను, భరత్, గుమ్మడపు విష్ణు, మండవ సత్య, బాల శ్రీను, సున్నం రాము, వెలుగోటి మహేష్, తోలెం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కట్న వేధింపుల మృతిపై ఎమ్మెల్యే కోరం కనకయ్య దిగ్భ్రాంతి

- కొత్తగూడెం ఆసుపత్రిలో మృతదేహానికి నివాళి.. కుటుంబానికి పరామర్శ
- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం





**టేకులపల్లి, జూలై 20,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం శంబునిగూడెం గ్రామానికి చెందిన భట్టు సుమ అనుమానాస్పద మృతిపై ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆయన కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఘటనకు కారణమైన వారిపై వెంటనే కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హామీఇచ్చారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.చివరగా మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఎమ్మెల్యే, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# గిరిజన విద్యార్థులకు దాతల చేయూత

- చిన్నారులకు స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ



**చర్ల, జూలై 20(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో కాలినడకన చేరుకుని బోదనెల్లి, కొర్కటంపాడు, ఎర్రబోరు, రామచంద్రాపురం గ్రామాల విద్యార్థులకు శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాక్షేత్రం చిన్న అరుణాచలం వ్యవస్థాపకులు శివ నాగస్వామి, హైదరాబాద్ దాతృత ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.శివ నాగస్వామి మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ గ్రామానికి, తల్లిదండ్రులకు, విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా భారతీయ ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను మరువరాదని హితవు పలికారు.మారుమూల గిరిజన గ్రామాల విద్యార్థులకు విద్యాభ్యాసానికి అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బందా మధు, వేములపల్లి ప్రవీణ్ కుమార్, పాసిగంటి శ్రీదేవి, మైనేని పద్మజా, పెందుర్తి ఆంజనేయులు, సిద్ధాంతి శ్రీనివాస్, కుర్నపల్లి సర్పంచ్ శ్యామల తిరుపతిరావు, కార్తీక్, శ్రావణ్, రాజేష్ కుమార్, రాకేష్, బన్నీ, తరుణ్, శ్రీకాంత్, శ్రీశర్మ, శ్రీహరి ఫణీంద్ర, బంటి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి సీపీఎం నిరసన



**పినపాక,జూలై 20(ప్రజాజ్యోతి ):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంపై ఉద్యమకారులతో తక్షణమే చర్చలు జరపాలని సీపీఎం జిల్లా సభ్యుడు నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం పినపాక మండలం ఈబయ్యారం క్రాస్‌రోడ్‌లో పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేయడాన్ని ఖండించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే ప్రభుత్వం నిరంకుశ చర్యలకు పాల్పడుతోందని, ఉద్యమకారులతో చర్చలు జరిపి విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్, మండల కమిటీ సభ్యులు మడివి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గుగులోత్ రామ్‌చందర్



**టేకులపల్లి, జూలై 20, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జూలై 18, 19తేదీల్లో జరిగిన తెలంగాణ గిరిజన సమాఖ్య మూడో రాష్ట్ర మహాసభల్లో టేకులపల్లి మండలానికి చెందిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, మండల కార్యదర్శి గుగులోత్ రామ్‌చందర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రామ్‌చందర్ మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధన, ఏజెన్సీ చట్టాల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమిస్తానని తెలిపారు. గిరిజనుల భూములను కాపాడటంతో పాటు పోడు సాగుదారులపై జరుగుతున్న నిర్బంధాలను అడ్డుకుంటామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాలను వెంటనే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనపై నమ్మకంతో మరోసారి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# వనవాసీ నిలయానికి బియ్యం వితరణ



**చర్ల, జూలై 20 (ప్రజా జ్యోతి ):** విద్యార్థుల చదువులకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించడం అభినందనీయమని వనవాసీ కళ్యాణ్ కొమరం భీం విద్యార్థి నిలయ కమిటీ సభ్యులు శివరాజు కిషోర్ అన్నారు. చర్లలోని రైస్‌పేట గ్రామానికి చెందిన స్వర్గీయ చీమకుర్తి రామకృష్ణ ప్రసాద్ (కిట్టప్ప) జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సోమవారం కొమరం భీం విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్లు, పండ్లు అందజేశారు.ఈ సందర్భంగా నిలయ ప్రముఖ్ సాంబయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శివరాజు కిషోర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని సమాజంలో సేవాభావంతో ముందుకు వస్తున్న ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్కారంతో కూడిన విద్య నేటి సమాజానికి ఎంతో అవసరమని దాతల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల క్రమశిక్షణ దాతలను ఎంతగానో ఆకట్టుకుంటోందని ఇదే స్ఫూర్తితో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం స్వర్గీయ చీమకుర్తి రామకృష్ణ ప్రసాద్ చిత్రపటానికి కమిటీ సభ్యులు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వనవాసీ కళ్యాణ్ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్షి , కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నీట్ పేపర్ లీకేజ్ పై సీఐటీయూ నిరసన

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్




**దమ్మపేట, జూలై 20(ప్రజాజ్యోతి):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు డిమాండ్ చేశారు. శనివారం దమ్మపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లేకార్డులతో నిరసన చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మురహరి రఘు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తు కోసం నీట్ పరీక్ష రాస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల పేపర్ లీకేజీ జరిగి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వరుసగా జరుగుతున్న పరీక్షల లీకేజీలతో విద్యావ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటోందని విమర్శించారు. లీకేజీ ఘటనలకు బాధ్యులైన అధికారులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి వెంటనే పదవికి రాజీనామా చేయాలని కోరారు.నిరసనలో సీఐటీయూ నాయకులు కవులూరి రామకృష్ణ, సతీష్, శ్రీను, యుగంధర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య సిబ్బందికి భద్రతా సామగ్రి పంపిణీ

**ములకలపల్లి, జూలై 20, (ప్రజాజ్యోతి ):** మండలంలోని పాత గంగారం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి సోమవారం భద్రతా సామగ్రిని పంపిణీ చేశారు. గ్రామ పాలకవర్గం సభ్యుల చేతుల మీదుగా సిబ్బందికి యూనిఫాంలు, షూలు, గ్లౌజులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని విధి నిర్వహణకు అవసరమైన రక్షణ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది సేవలు ఎంతో కీలకమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పట్ల బాధ్యతతో వ్యవహరించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోడే చైతన్య, ఉపసర్పంచ్ శ్రీదేవి, వార్డు సభ్యులు మడకం రమేష్, కల్లూరి ప్రసాద్, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నానిబాబు, పంచాయతీ సిబ్బంది వెంకటేష్, సునీల్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



# "మిస్ యూ అమ్మా... నాన్నా... అన్నయ్య నరేష్..."

- చివరి లేఖతోనే శాశ్వత నిద్రలోకి జారుకున్న శ్రీకాంత్
- ప్రేమ విఫలమై మనోవేదన.. హనుమతండాలో విషాదం





**టేకులపల్లి, జూలై 20 (ప్రజాజ్యోతి):** జీవితాంతం తోడుంటుందని నమ్మిన ప్రేమ దూరమైంది. ఆ బాధను తట్టుకోలేక ఓ యువకుడు తన తల్లిదండ్రులు, అన్నయ్యను తలుచుకుంటూ "మిస్ యూ అమ్మా... నాన్నా... అన్నయ్య నరేష్..." అని చివరి లేఖ రాసి జీవితానికి వీడ్కోలు పలికాడు. ఈ హృదయవిదారక ఘటన టేకులపల్లి మండలం హనుమతండాలో సోమవారం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీకాంత్ (25) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అతడిని గమనించి విషాదంలో మునిగిపోయారు. అక్కడే లభించిన లేఖలో "మిస్ యూ అమ్మా... నాన్నా... అన్నయ్య నరేష్..." అని రాసి ఉండటం కుటుంబ సభ్యులను, గ్రామస్థులను కన్నీటి పర్యంతం చేసింది.స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికులను విచారిస్తూ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.శ్రీకాంత్ అకాల మరణం హనుమతండలో విషాదాన్ని నింపింది. క్షణికావేశంలో తీసుకున్న ఒక నిర్ణయం ఓ కుటుంబానికి తీరని వేదనను మిగిల్చిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పంట పొలాల మధ్య కాలువ వద్దంటున్న రైతులు

- ప్రత్యామ్నాయ లింకు కాలువలతో చెరువులకు నీరందించాలని ఎమ్మెల్యే జారేకు వినతి



**అన్నపురెడ్డిపల్లి, జూలై 20 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల రాజపురం గ్రామానికి చెందిన రైతులు సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి చెరువులకు లింకు కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. నర్సాపురం రెవెన్యూ పరిధిలో పెద్దమ్మ చెరువు నుంచి వరి పొలాల మధ్య వరకు నిర్మించనున్న 11ఆర్–ఆర్ యం1 లింకు కాలువ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కాలువ నిర్మాణంతో చిన్న, సన్నకారు రైతులకు చెందిన సుమారు 13 ఎకరాల వ్యవసాయ భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రాముడు చెరువు, పెద్దమ్మ చెరువులకు లింకు కాలువలు మ్యాపులో ఉన్నాయని, వాటి ద్వారా రెండు చెరువుల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు తెలిపారు. పంట భూముల మధ్య నుంచి వెళ్లే 11ఆర్–ఆర్ యం1 కాలువ పనులను నిలిపివేసి, చెరువులకు ఉపయోగపడే లింకు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నర్సాపురం గ్రామంలో నిర్వహించే గ్రామసభకు హాజరై సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, గణపతిరెడ్డి, ఏసుబాబు, సీతారామిరెడ్డి, అరుణ, పృథ్వి, కేశవులు, కంచు ప్రసాద్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట తహసీల్దార్‌గా మద్దినేని మురళి మార్క్..!

- మొదటి రోజే పారదర్శక పాలనకు శ్రీకారం
- అవినీతికి తావులేదంటూ కార్యాలయంలో ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు



**దమ్మపేట, జూలై 20(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల నూతన తహసీల్దార్‌గా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన కె. రామ్ నరేష్ అవినీతి ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ కావడంతో, ఆయన స్థానంలో అండర్ ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మద్దినేని మురళిని ప్రభుత్వం డిప్యుటేషన్‌పై దమ్మపేట తహసీల్దార్‌గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన తొలి రోజే ప్రజాపాలన, పారదర్శకత, అవినీతి నిరోధక చర్యలకు ప్రాధాన్యం ఇస్తూ తనదైన ముద్ర వేశారు.

### ››› ఘన స్వాగతం శుభాకాంక్షల వెల్లువ

బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధికారితో కలిసి మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు.

### ››› మొదటి రోజే సంస్కరణలకు శ్రీకారం

బాధ్యతలు చేపట్టిన వెంటనే మద్దినేని మురళి కార్యాలయ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి వ్యక్తికి గౌరవప్రదంగా సేవలు అందించాలని, ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

### ››› ప్రత్యేక ఫ్లెక్సీతో అవినీతికి గట్టి హెచ్చరిక

కార్యాలయానికి వచ్చే ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ఫ్లెక్సీని ఏర్పాటు చేయించడం విశేషంగా నిలిచింది. ఆ ఫ్లెక్సీలో




"ఆదర్శమైన సేవలు పొందడం మీ హక్కు – సకాలంలో అందించడం మా బాధ్యత"

"చట్టపరంగా, నిబంధనల ప్రకారం న్యాయం చేయడమే మా ధ్యేయం"

"లంచం ఇవ్వకండి... ఎవరూ లంచం కోసం ఒత్తిడి చేయనివ్వకండి... అవినీతికి తావు ఇవ్వకండి"

"మీ సమస్యలను మా దృష్టికి తీసుకురండి – పారదర్శక పాలనకు సహకరించండి"

అనే సందేశాలను స్పష్టంగా ప్రదర్శించారు. ఈ ఫ్లెక్సీ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచడంతో పాటు కార్యాలయ పనితీరుపై స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ››› ప్రజలకే ప్రాధాన్యం... సేవలే లక్ష్యం

రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సేవ నిర్దే శిత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, కార్యాలయ సమయాలను అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ ఆదేశించినట్లు తెలిసింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా, కార్యాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం.

### ››› రెవెన్యూ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించడమే లక్ష్యం

మద్దినేని మురళి మాట్లాడుతూ, "ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయి పారదర్శకతతో పనిచేస్తాను. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించడమే నా ప్రధాన బాధ్యత. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా పరిష్కరిస్తూ రెవెన్యూ శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా కృషి చేస్తాను. అవినీతికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండదు" అని స్పష్టం చేశారు.

### ››› మార్పు దిశగా దమ్మపేట రెవెన్యూ కార్యాలయం

కొత్త తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన తొలి రోజే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇవ్వడం, అవినీతి నిరోధక సందేశాలతో ప్రత్యేక ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం, ప్రజా సేవలపై స్పష్టమైన దృక్పథాన్ని ప్రకటించడం వంటి చర్యలు దమ్మపేట రెవెన్యూ కార్యాలయంలో కొత్త మార్పులకు నాంది పలికాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు జవాబుదారీతనం, పారదర్శకత, వేగవంతమైన సేవలతో కొత్త పరిపాలనకు శ్రీకారం చుట్టినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

# శివనామస్మరణతో మార్మోగిన మల్లికార్జున స్వామి ఆలయం

- మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం
- భక్తులకు అన్నప్రసాద వితరణ





**అన్నపురెడ్డిపల్లి, జూలై 20 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం సోమవారం శివనామస్మరణతో మార్మోగింది. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు తదితర ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అర్చకుల వేద మంత్రాలు, భక్తుల హరహర మహాదేవ, శంభో శంకర నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని రుద్రాభిషేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గ్రామస్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు మహాప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమాలను దేవస్థానం మేనేజర్ పి.వి. రమణ పర్యవేక్షణలో నిర్వహించారు.

# నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై సీపీఎం ధ్వజం

- విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్




**దమ్మపేట, జూలై 20(ప్రజాజ్యోతి):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం దమ్మపేటలోని సుందరయ్య భవన్ లో మండల కమిటీ సభ్యుడు కొలికిపోగు శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన పార్టీ మండల ముఖ్యుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నీట్ పేపర్ లీకేజీ దెబ్బతీసిందన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేలా కేంద్ర ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కోరారు.లడఖ్ కు చెందిన సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేయడాన్ని కూడా ఆయన ఖండించారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని, వారికి మద్దతుగా నిర్వహించే నిరసన కార్యక్రమాలకు ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థి సంఘాలు, ప్రజలు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.సమావేశంలో మాజీ జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మీనారాయణ, కొప్పుల శ్రీనివాసరావు, కొలికిపోగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి పెద్ద దిక్కు... ప్రభుత్వ ఆసుపత్రులేనా..?




# పేదల వైద్యం.. వాస్తవ చిత్రం

**ప్రజాజ్యోతి ప్రత్యేక కథనాల పరంపర**

**పేదలకు, గిరిజనులకు, రోజువారీ కూలీలకు, వృద్ధులకు, అత్యవసర పరిస్థితుల్లో మొదట గుర్తొచ్చేది ప్రభుత్వ ఆసుపత్రే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయలేని సామాన్య ప్రజలకు ప్రభుత్వ వైద్యమే ఆశాకిరణం. జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల అంచనాలు మరింత పెరిగాయి. బోధనా ఆసుపత్రిగా మారిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రజలు ఆశించారు. అలాంటి ప్రభుత్వ వైద్య వ్యవస్థ నిజంగా ప్రజల అవసరాలను తీర్చగలుగుతోందా? జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాయా? లేక సిబ్బంది కొరత, మౌలిక వసతుల లోపం, పెరుగుతున్న రోగుల సంఖ్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయా? అనే అంశాలపై "ప్రజాజ్యోతి" ప్రత్యేక కథనాల పరంపరను ప్రారంభిస్తోంది.**

**భద్రాద్రి కొత్తగూడెం (ప్రజాజ్యోతి జిల్లా బృందం) (ప్రజాజ్యోతి):**

### ఏకైక వైద్య వ్యవస్థగా.. ప్రభుత్వ ఆసుపత్రులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భౌగోళికంగా విస్తారమైన జిల్లా. అడవులు, గిరిజన ప్రాంతాలు, సింగరేణి కార్మిక ప్రాంతాలు, మారుమూల గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, మణుగూరు, భద్రాచలం వంటి పట్టణ ప్రాంతాలతో పాటు చర్ల, దుమ్ముగూడెం, వాజేడు, అశ్వారావుపేట, ములకలపల్లి, గుండాల, అన్నపురెడ్డిపల్లి, టేకులపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, అల్లపల్లి తదితర మండలాల్లోని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారం. ముఖ్యంగా గిరిజన గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలు, అడవి గ్రామాల్లో నివసించే ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలే అందుబాటులో ఉండే ఏకైక వైద్య వ్యవస్థగా నిలుస్తోంది. చిన్న జ్వరం నుంచి అత్యవసర చికిత్స వరకు ఎక్కువ మంది ప్రభుత్వ ఆసుపత్రుల పైనే ఆధారపడుతున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ వైద్య సేవలను బలోపేతం చేస్తున్నట్లు ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందనే ప్రశ్న తరచూ వినిపిస్తోంది. వాస్తవానికి ప్రతి మండలంలో వైద్య సేవల పరిస్థితి ఒకేలా లేదు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల కొరత, మరికొన్ని చోట్ల సిబ్బంది సమస్య, ఇంకొన్ని ఆసుపత్రుల్లో పరికరాల కొరత, మరికొన్ని పీహెచ్‌సీల్లో భవనాల సమస్యలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

### కొన్ని ఉదంతాలతో.. ప్రజల్లో కొన్ని సందేహాలు..?

జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. రోజూ వందలాది మంది రోగులు ఈ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వర్షాకాలంలో విషజ్వరాలు, డెంగీ, వైరల్ ఫీవర్లు, ఇతర సీజనల్ వ్యాధులు పెరిగే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులపైనే మరింత భారం పడుతోంది. అదే సమయంలో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కూడా ఇవే ప్రధాన వైద్య కేంద్రాలు. అయితే ఇక్కడ మెరుగైన సేవలు అందుతున్నప్పటికీ, అప్పుడప్పుడు జరుగుతున్న కొన్ని ఉదంతాలతో ప్రజల్లో కొన్ని సందేహాలు, ప్రశ్నలు మాత్రం అలాగే ఉన్నాయి. దాంతో అన్ని విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారా? ప్రత్యేక వైద్యులు ప్రతి ఆసుపత్రిలో సేవలందిస్తున్నారా? అవసరమైన మందులు ఎప్పటికప్పుడు లభిస్తున్నాయా? అత్యాధునిక వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయా? అత్యవసర సమయంలో రోగులు ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోంది? ఇవన్నీ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్న ప్రశ్నలే. అయితే ప్రభుత్వ వైద్యంపై ప్రజల విశ్వాసం మరింత బలపడాలంటే కేవలం భవనాలు నిర్మించడం మాత్రమే కాదు, నాణ్యమైన వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండాలి. ప్రతి రోగికి సమయానికి చికిత్స, అవసరమైన మందులు, సరిపడా వైద్య సిబ్బంది, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక పరీక్షల సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వం పై ఉంది. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఈ సేవలు మరింత కీలకం. అందుకే ప్రజాజ్యోతి చేపట్టిన ఈ ప్రత్యేక కథనాల పరంపరలో జిల్లాలోని ప్రభుత్వ వైద్య వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను పాఠకుల ముందుకు తీసుకురానుంది. ఆసుపత్రుల పనితీరు, వైద్యుల లభ్యత, మౌలిక వసతులు, పరికరాలు, మందుల సరఫరా, రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అధికారుల స్పందన వంటి అంశాలను వరుస కథనాల రూపంలో అందించనుంది.